క్లుప్తంగా

ప్రత్యేక ఆకర్షణ



పోలీస్ వేషధారణలో చిన్నారులు

సీతానగరం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రానికి చెందిన ఇద్దరు చిన్నారులు ఆర్ శ్రయాన్, అయాన్‌లు పోలీస్ దుస్తులు వేసుకుని రాష్ట్ర రహదారిలో సమాజానికి సెల్యూట్ చేయడం పలువురిని ఆకర్షించింది. అలాగే ఆరవింద్‌కుమార్ ఇంట్లో ఆవుకు జన్మించిన పుంగనూరు దూడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పశుసంవర్ధక శాఖ ఎ.డి సీహెచ్ దీనకుమార్ ఆధ్వర్యంలో ఆరవింద్‌కుమార్ పుంగనూరు దూడను కలెక్టరేట్‌లో ప్రదర్శనలో ఉంచడంతో కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రత్యేక బహుమతి అందజేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన అంజలికి జ్ఞాపిక, నగదు అందిస్తున్న సర్పంచ్ హరికృష్ణ

మక్కువ: మండలంలోని బంగారువలస గ్రామ పాఠశాల పూర్వ విద్యార్థులు ఈ ఏడాది పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం ప్రోత్సాహకాలు అందించారు. గొల్లు అంజలి, తదితరులకు సర్పంచ్ హరికృష్ణ చేతులమీదుగా జ్ఞాపికలు, నగదు అందజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్యాంబాబు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్యాంబాబును ఎఫ్ఏసీగా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన తాడేపల్లిగూడెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి బదిలీపై పాలకొండకు వచ్చారు. ఇక్కడ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

అపరిచితులపై ప్రత్యేక దృష్టి : సీఐ



సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో సంచరించే అపరిచిత వ్యక్తులపై దృష్టి సారించాలని, వారిలో అనుమానితులెవరైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం గ్రామాల్లో చిన్న చిన్న దొంగతనాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దాన్నే దృష్టిలో ఉంచుకొని తమ సిబ్బందిచే ప్రత్యేక గస్తీ నిర్వహించడంతో పాటు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులెవరైనా కనిపిస్తే 97049 58869 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.


ఉత్తమ విద్యార్థులకు నగదు సాయం



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామానికి చెందిన కళింగి సాయిప్రసాద్ జ్ఞాపకార్థం జిల్లా పరిషత్ ఉన్నాత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు జిల్లా డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కళింగి మల్లేశ్వరరావు రూ.10వేలు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు సాయం చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఈ సాయం చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



భామినిలో కురుస్తున్న వర్షం

భామిని: వేసవిని తలపించేలా ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలకు మంగళవారం కురిసిన వర్షం ఊరట కలిగించింది. కొద్ది రోజులుగా వానలు లేక ఎండలు తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు కురిసిన వర్షం ఉపశమనమిచ్చింది. వరినాట్లు వేస్తున్న తరుణంలో వర్షాలు లేక ఎండి పోయే పరిస్థితిలో వానజల్లులు కురిసి రైతులకు మేలు చేసింది.

మా తుఝే సలామ్..!

- వాడవాడలా ఎగిరిన మువ్వన్నెల జెండా
- నియోజకవర్గ వ్యాప్తంగా స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురం టౌన్: తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, తహసీల్దార్ శివన్నారాయణ



సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బి రమణమ్మ



సీతానగరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ఎన్వీరమణ



పార్వతీపురం టౌన్: ఐటీడీఏ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్

పార్వతీపురం టౌన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గం వ్యాప్తంగా మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. నియోజకవర్గ ప్రజల్లో దేశభక్తి భావం ఉప్పొంగింది. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, మున్సిపల్, వైఎస్సార్‌సీపీ పట్టణ, జిల్లా కార్యాలయాల్లో జెండాపండగను ఘనంగా నిర్వహించారు.

బలిజిపేట: మండలంలో స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. కార్యక్రమాల్లో భాగంగా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఎంపీపీ నాగమణి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై పాపారావు పతాకావిష్కరణ చేశారు. వివిధ పాఠశాలల వద్ద విద్యాకమిటీ చైర్మన్‌లు, సర్పంచ్‌లు పతాకావిష్కరణలు చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ అప్పలరాజు, ఎంఈఓ సామల సింహాచలం, మండలస్థాయి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలో వాడవాడలా స్వాతంత్య్ర దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయం, పీహెచ్‌సీ కార్యాలయ ం ఆవరణలలో ఎంపీపీ బలగ రమణమ్మ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, డాక్టర్ శిరీషతో పాటు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్వీ రమణ మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి ప్రభుత్వం అమలు చేసిన ప్రగతిని వివరించారు.స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ డీజీవీఎల్ త్రినాథ్, స్థానిక ఉన్నత పాఠశాలవద్ద హెచ్ఎం ప్రసన్న లక్ష్మి పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పలు సంఘాలు పూర్వవిద్యార్థులకు సమకూర్చిన నగదు ప్రోత్సాహక బహుమతులు ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, సచివాలయ కన్వీనరు బి.శ్రీరాములు నాయుడు, స్థానిక ఎంపీటీసీలు ఎస్ గౌరి, బి కుసుమ, జి బుజ్జీ చేతులమీదుగా అందజేశారు. పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సీ రామకృష్ణ, పెదభోగిలి సచివాలయం వద్ద సర్పంచ్ జె.తేరేజమ్మ, బూర్జ, నిడగల్లు, గాదెలవలస, ఆర్.వెంకంపేట, మరిపివలస ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

మక్కువలో..

మక్కువ: మండలంలోని అన్ని ప్రభుత్వకార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు జెండా ఎగురువేశారు. అలాగే కేజీబీవీ, బంగారువలస, శంబర పాఠశాలల్లో జెండా ఎగురవేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, డీసీసీబీ డైరక్టర్ మావుడి తిరుపతి నాయుడు, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ, ఎంఈఓలు సత్యానారాయణ, శ్యామ్‌సుందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాచిపెంటలో..

పాచిపెంట: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్నాన ప్రమీల, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.రాజశేఖర్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఫకృద్దీన్, చినబజారు కూడలిలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, గురువునాయుడుపేటలో గొట్టాపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్రనాథ్ జెండాలు ఎగురువేశారు. ఈ సందర్భంగా సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

సాలూరులో..

సాలూరు: పట్టణం, మండలంలో జెండా పండుగ ఘనంగా జరిగింది. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి సౌమ్యా జాస్పిన్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు టి.తిరుపతిరావు జెండా ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జి. రాములమ్మ, మామిడిపల్లి సచివాలయంలో సర్పంచ్ సువ్వాడ శశికళ జెండా ఎగురవేశారు.



బలిజిపేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేసిన ఎంపీపీ నాగమణి,తదితరులు



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



పార్వతీపురం టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



బలిజిపేట: పోలీస్‌స్టేషనులో పతాకావిష్కరణ చేసిన ఎస్సై పాపారావు



పార్వతీపురం టౌన్: కోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదరరావు



పార్వతీపురం టౌన్: మున్సిపల్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, కమిషనర్ రామప్పలనాయుడు



మక్కువ: స్వాతంత్య్రసమరయోధుల వేషధారణలో బంగారువలస విద్యార్థులు



మక్కువ: జెండా ఎగురువేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు



మక్కువ: కేజీబీవీ విద్యార్థుల విన్యాసాలు



పాచిపెంట : ఎంపీడీఓ కార్యాలయంలో జండా ఎగరవేస్తున్న ఎంపీపీ బద్నాన ప్రమీల



సాలూరు: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్ద జాతీయ జెండాకు అభివాదం చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సౌమ్యా జాస్పిన్, తదితరులు



సాలూరు: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయజెండాకు అభివాదం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు



సాలూరు: మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ,తదితరులు



సాలూరు: పోలీస్‌స్టేషన్‌లో జాతీయజెండా ఎగురవేస్తున్న పట్టణ సీఐ శ్రీనివాసరావు

గ్రామ సచివాలయం ఉద్యోగుల సంఘం ఎన్నిక

గుమ్మలక్ష్మీపురం: మండల గ్రామ సచివాలయం ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ మేరకు స్థానిక బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద మంగళవారం గ్రామ సచివాలయం ఉద్యోగులంతా సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ సచివాలయం ఉద్యోగుల సంఘం మండల ప్రెసిడెంట్‌గా నిమ్మక మహేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా అల్లక లక్ష్మి, జనరల్ సెక్రటరీగా ఆరిక నరేష్, జాయింట్ సెక్రటరీగా కోలక బలరాం, ట్రెజరర్‌గా బాబూరావు, ఆర్గనైజర్ సెక్రటరీగా రామచంద్రారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.విజయ్, విజయ, దేవ్‌కుమార్, సురేష్, సంపత్, నిఖిల్, కృష్ణ, విజయ్‌శ్రీలక్ష్మి, రమేష్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల ఐక్యతకు, సంక్షేమానికి కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు.



గ్రామ సచివాలయం ఉద్యోగుల సంఘం నూతన కమిటీ

నాయీబ్రాహ్మణులకు జేసీ ప్రభాకరరెడ్డి క్షమాపణలు చెప్పాలి

కురుపాం: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి నాయీబ్రాహ్మణులకు క్షమాపణలను చెప్పాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.టి.దుర్గారావు, సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం ఆ సంఘ సభ్యులు సమావేశమై విలేకరులతో మాట్లాడారు. గత నెల 30న ఓ చానల్ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో జేసీ దూషించటం జరిగిందన్నారు. దీని ద్వారా లక్షలాది నాయీబ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల రక్షణ కోసం జీఓ 50 ను తీసుకొచ్చిందని ఈ జీఓ ప్రకారం దివాకరరెడ్డిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.గౌరీశ్వరరావు, అలుగోలు సాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

రామభద్రపురం: స్థానిక ఎగువ హరిజనవీధి ప్రాథమిక పాఠశాలకు స్థానిక వ్యాపారి మాదేటి వేణు రూ.10 వేలు విలువైన జిరాక్స్ ప్రింటర్‌ను మంగళవారం వితరణ చేశారు. అలాగే మండలంలోని పాడివానివలస ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు వ్యాపారి బందారు నాగరాజు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూ రామారావు, గుర్రాల ఈశ్వరరావు, డర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం: ఉపాధ్యాయులకు జిరాక్స్ ప్రింటర్‌ను అందజేస్తున్న మాదేటి వేణు

పాఠశాలకు నగదు విరాళం

బాడంగి: మండలంలోని కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు తెంటు సత్యంనాయుడు మాస్టారు రూ.10 వేలు విరాళం అందజేశారు. ఆయన భార్య భారతి జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు టి.మధుసూదనరావు చేతుల మీదుగా హెచ్ఎం శ్రీదేవికి అందజేశారు. పదోతరగతి పరీక్షల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు, స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు సమకూర్చేందుకు ఈ మొత్తాన్ని వినియోగించాలని కోరారు.

42 మందిపై కేసు

సీతంపేట: మండలంలోని బిల్లమడ గ్రామ పరిధిలో వెంకటపతిరాజు జిరాయితీ భూమిలో అక్రమంగా చొరబడి పాకలు వేసిన వాటిని రెవెన్యూ సిబ్బంది నిర్మూలించడానికి వెళ్తే విధులు నిర్వహించనీయకుండా ఆక్రమణదారులు అడ్డుపడడంతో 42 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.నీలకంఠరావు తెలిపారు. ఆ భూముల్లో ఎటువంటి ఆక్రమణలు చేయకూడదని, ఆ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నా.. ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లఘించినట్టు తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నేత్ర వైద్య శిబిరం రేపు

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ గ్రామంలో శివాలయం ప్రాంగణంలో ఈ నెల 17న గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. హోలీక్రాస్ ఎన్‌జీఓ, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణా సంస్థ సంయుక్తంగా ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారు పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు మంగళవారం కోరారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవసరమైన శస్త్ర చికిత్సలు, కంటి అద్దాలు అందించనున్నట్టు తెలిపారు.